# భోజనరాజు

అతివృష్టి వల్లా, అనావృష్టి వల్లా కూడా పంటలు పాడయినట్టు, నా మీద ప్రేమ ఎక్కువైనప్పుడూ, తక్కువైనప్పుడ కూడా మా ఆవిడ వంట పాడు చేస్తూ వుంటుంది. మా ఆవిడకి నామీద గల ప్రేమ మరీ ఎక్కువ కాకుండానూ మరీ తక్కువ కాకుండానూ వుంచటానికి నేను ప్రయత్నిస్తుంటాను. కాని మా ఆవిడ మానసిక ప్రవృత్తి ఒక్కోసారి నా చెప్పుచేతల్లో వుండకుండా పోతుంది.

మా ఆవిడ మనస్సును ఎప్పుడూ నా స్వాధీనంలో వుంచటానికి నా దగ్గర అట్టి ఆయుధాలేమీ లేవు.

కొన్ని వున్నా కొన్నిసార్లవి పని చెయ్యవు. ఫలితం - వంట పాడు కావడం.

అసలిదంతా చెప్పటానిక్కారణమేమిటంటే, నా ఆసక్తి మా ఆవిడ మీద కాదు - ఆవిడ చేసే వంటమీద. నేను భోజనప్రియుణ్ణి. ఈ కథ మా ఆవిడ గురించి కాదు - నా భోజన ప్రియత్వం గురించి.

* * *

మా ఆవిడ మా ఆవిడ కావటానికి ముందు నేనింకా చాలామంది అమ్మాయిల్ని పెళ్ళి చూపులు చూశాను. చూడ్డానికి వాళ్ళలో కొందరు నాకు నచ్చారు. కాని పైపై అందాలకి మోజుపడి మోసపోయే రకం కాదు నేను. పెళ్ళంటే నూరేళ్ళ వంట! కనీసం యాభై ఏళ్ళు పెళ్ళాం చేతి వంట తినాలి. ఇంత ముఖ్యమైన విషయం ఎలా మర్చిపోతాను ? మర్చి పోలేదు.

నేను పెళ్ళి చూపులు చూసిన ప్రతి పిల్లనీ నేను అడిగిన మొట్ట మొదటి ప్రశ్న - "నీకు వంటొచ్చా" ? అని. ఆ ప్రశ్నకి చాలామంది 'వచ్చు' అనే సమాధం చెప్పారు. కాని అంతటితో

నేను తృప్తి పడి వూరుకోలేదు. "నేను బియ్యే పరీక్ష పాసయ్యాను" అని డిగ్రీ చూపించినా నమ్మకుండా, ఆ డిగ్రీ ఇచ్చిన యూనివర్సిటీ వాళ్ళే, ఎమ్మేలో సీటివ్వడానికి మళ్ళీ ఎంట్రెన్స్ పరీక్ష పెట్టినట్టుగా, వంటొచ్చునన్న వాళ్ళందరికి నేను ప్రాక్టికల్ పరీక్ష పెట్టాను. కాఫీ, టీలు మొదలుకొని, కూరలు, పచ్చళ్ళూ, పప్పులూ, పాయసాలూ, పిండివంటలూ స్వయంగా చేసి చూపించాలి. చేసినవి రుచిగా వుండాలి.

ఈ టెస్టుకి చాలామంది అమ్మాయిలు హడలిపోయి ముందే తప్పుకున్నారు. మరికొందరు వంటల మీద నాకున్న ఆసక్తిని అపార్థం చేసుకుని ఏవో వంకలు పెట్టి తప్పుకున్నారు. ఇంకా కొందరు పరీక్షకి కూచుని తప్పారు. ఇంకా చాలా మందిని చూడగా చూడగా, చూసి వదిలెయ్యగా, చిట్టచివరికి మా ఆవిడని (అప్పటికి మా ఆవిడ కాదు లెండి) చూడ్డమూ, ఆవిడ వంట రుచి చూడ్డమూ, చూసి వరించడమూ, వరించి పెళ్ళాడ్డమూ జరిగింది.

ఇది నా పెళ్ళి చూపుల కథ కాదు. నా భోజప ప్రియత్వానికి సంబంధించిన కథ. ఈ విషయంలో నాకెంత పట్టుదలో చెప్పడానికే ఫ్లాష్‌బాక్‌గా నా పెళ్ళి చూపుల గురించి చెప్పాను. అంతే. ఇక అసలు కథకొస్తాను.

అసలీ ప్రపంచంలో మంచి రుచికరమైన భోజనానికి మించింది మరోటి లేదంటాను నేను. ఇష్టమైన వంటకాలతో సుష్టుగా భోం చెయ్యడం కంటే ఆనందకరమైన పనీ, ఆ మాటకొస్తే గొప్ప పనీ ఇంకోటుందంటారా ? లేదు గాక లేదు.

మంచి భోజనం మనిషికి బలమిస్తుంది. మనసుకి హాయినిస్తుంది. కమ్మటి భోజనం కలత తీరుస్తుంది. కవి ఏమన్నాడు ? 'ఈసురోమని మనుజులుంటే దేశమేగతి బాగుపడునోయ్' అన్నాడు. ఈసురోమంటూ వుండకుండా వుండాలంటే మంచి తిండి తినాలి. బాగా తినాలి. అందరూ బాగా తింటే దేశం బాగుపడినట్టే. దేశం బాగుపడాలంటే దేశం కోసం పాటు బడాలంటే బాగా తినాలి. అంచేత బాగా కడుపు నిండా తినగలిగినవాడే నిజమైన దేశభక్తుడు. ఇదీ నా సిద్ధాంతం.

భోజనం గురించి నా సిద్ధాంతాలింకా చాలా వున్నాయి. అవన్నీ క్రోడీకరించి 'దేశభక్తి - మరియు మంచి భోజనము' అని కొన్నాళ్ళ క్రితం గొప్ప పరిశోధనా గ్రంథమొకటి రాశాను. అయితే అది రాయడంలో నా దేశభక్తిని గుర్తించక, ఆ పుస్తకమెవరూ అచ్చెయ్యలేదనుకోండి. అది వేరే సంగతి.

ఇది నా దేశభక్తిని గురించిన కథ కాదు.

ముందే చెప్పినట్టుగా ఇది కేవలం నా భోజన ప్రియత్వం గురించిన కథ. అయితే దేశం పేరెత్తగానే చాలామంది దేశభక్తులకి ఆవేశమొచ్చినట్టుగా, తిండి పేరెత్తగానే నాకూ ఆవేశ మొచ్చి కాస్త-అటూ ఇటూగా మాట్లాడుతుంటాను. మన్నించండి - అసలు కథ ఇదుగో

మొదలు పెడ్తున్నాను.

కథలు బాగా రాసేవాడి కొకడి కింకో కథలు బాగా రాసేవాణ్ణి చూస్తే మంట. ఒక అందమైన వాడి కింకో అందమైన వాడు కనబడితే కన్నెర్ర. ఒక సినిమా స్టారుకి ఇంకో సినిమా స్టారంటే పైకి నవ్వు, లోపల ఏడుపు. లంచాలు బాగా తినే ఒక ఆఫీసరుకి తనలాంటి వాడే ఇంకోడు తగిల్తే సహించలేడు. తన్ని తగిలెయ్యటానికి ప్రయత్నిస్తాడు.

కాని - ఒక భోజన ప్రియుడికి ఇంకో భోజన ప్రియుణ్ణి చూస్తే మాత్రం మహదానందంగ వుంటుంది. అందుకే ఆనందమూర్తిని చూసినప్పుడు నాకు నిజంగానే మహదానందం కలిగింది.

మా ఆఫీసులో సుబ్బారావని ఒకడూ, వెంకటసుబ్బారావని ఒకడూ వున్నారు సుబ్బారావుకి రావలసిన ప్రమోషన్ సుబ్బారావుకు రాకుండా వెంకటసుబ్బారావు కొచ్చింది. అంచేత - వెంకట సుబ్బారావు తనకి ప్రమోషన్ వచ్చినందుకు ముందుగా ఒకరోజు అందరికీ టీ ఇచ్చాడు. తనకొచ్చిన ప్రమోషన్ సుబ్బారావుకి రానందుకు ఇంకో రోజు అందరికీ టీ పార్టీ ఇచ్చాడు. ఆ పార్టీ ఇచ్చిన్రోజునే ఆనందమూర్తి కొత్తగా మా ఆఫీసులోకొచ్చాడు.

తిండి దగ్గరా డబ్బు దగ్గరా మొహమాటం పనికిరాదన్నారు పెద్దలు. ఆనందమూర్తి ఆవేళే కొత్తగా వచ్చినా ఏమాత్రమూ మొహమాటపళ్ళేదు. ఒకటి తర్వాత వొకటి అరడజను స్వీట్లూ, అదే సంఖ్యలో కారా ప్లేట్లూ అతి సునాయాసంగా లాగించేశాడు. నాకు సరిగ్గా గుర్తు లేదు కానీ, టీలు కూడా రెండో మూడో కప్పులు తాగినట్టు గుర్తు. చివరికి కిళ్ళీలు కూడా రెండు తీసుకుని, ఆ బుగ్గ నొకటీ ఈ బుగ్గ నొకటి బిగించి - పక్కనే వున్న నన్ను 'ఒక సిగరెట్టిస్తారా గురూ గారూ' అని అడిగి తీసుకుని వెలిగించి, చిద్విలాసంగా పొగ వదిలి, "మీ పేరేమిటన్నారు మాస్టారూ" అన్నాడు నా వంక క్రీగంట చూస్తూ.

ఇది ఆనందమూర్తితో నా మొట్ట మొదటి పరిచయం.

మొట్టమొదటి పరిచయంలోనే ఆనందమూర్తి నన్ను అమితంగా ఆకర్షించాడు. అందుక్కారణం అతని రూపం కాదు, గుణం కాదు, చదువు కాదు, సంస్కారం కాదు. అసలిలాంటి విషయాల్లో ఆనందమూర్తిలో ప్రత్యేకత ఎంతమాత్రమూ లేదు. అతను చాలా మామూలు మనిషి. అతి సాధారణమైన వ్యక్తి. కాని అసాధారణమైన అతని భోజనశక్తి నన్ను ఆకట్టుకుంది.

మా ఆఫీసులో చేరిన అనతికాలంలోనే ఆనందమూర్తి నాకు మంచి మిత్రుడూ, మిగతావాళ్ళందరికీ చెడ్డ మిత్రుడూ అయిపోయాడు. ఆనందమూర్తిలో వున్న ఏ శక్తి నాకు నచ్చిందో అదే మిగతావాళ్ళెవరికీ నచ్చలేదు.

అప్పటిదాకా దిగులుగా, నీరసంగా, ఏడుపు మొహంతో వుండే ఆనందమూర్తి మధ్యాహ్నం

లంచ్ టైమయ్యేసరికి మహా చురుగ్గా మారిపోతాడు.

"గురూ! ఇవ్వాళ నువ్వేం తెచ్చావ్?" "ఇవ్వాళ మాస్టారేదో మంచి టిఫిన్ తెచ్చినట్టున్నారు' ', నాకు పెరుగు వడంటే ప్రాణం సార్, ఒకటిలా ఇస్తారేమిటి, ఈ రకంగా ఎవరో ఒకరి ప్రక్కన చేరి తన టిఫిన్ కానిచ్చేస్తాడు ఆనందమూర్తి. అతను స్వయంగా ఎన్నడూ ఏవిధమైన తినుబండారమూ తెచ్చిన పాపాన పోలేదు.

ఆఫీసులోనే కాదు....,బయట కూడా అంతే. ఎవరైనా నలుగురు తెలిసినవాళ్ళు ఏ హోటల్‌కో బయల్దేరారంటే - వాళ్ళ వెనకే ఆనందమూర్తి కూడా తయారౌతాడు. వాళ్ళు పిలవకపోయినా వెళ్తాడు. వాళ్ళు ఆర్డరివ్వకపోయినా మొహమాటం లేకుండా తనే తెప్పించుకు తింటాడు. బిల్లు మటుకు పొరపాటున కూడా తను కట్టడు.

ఆనందమూర్తి తిండి వేటలో, తరువాతి దశ - తెలిసిన వాళ్ల ఇళ్ళకి తెలియకుండా భోజనానికి వచ్చేయటం. సరిగ్గా భోజనాల సమయానికి ఏ తోటి ఉద్యోగి ఇంట్లోనో ఏ పరిచయస్తుడి ఇంట్లోనో వచ్చి కూర్చుంటాడు. ఎంతసేపటికీ కదలడు. ఇంటాయన మొహమాటానికి, "మీరూ భోంచేద్దురుగాని రండి" అంటే సరే పేచీయే లేదు. లేదా తనే సమయం చూసి "మీ ఇంట్లో భోంచేసి చాలా రోజులై పోయింది" అనో, "మా అక్కగారి వంట తిని యుగాలైపోయింది" అనో, ఇవేమీ పని చెయ్యవనుకుంటే "ఇవ్వాళ మీ ఇంట్లో భోంచేసి గాని వెళ్ళను సార్" అనో చెప్పేసి, వెళ్ళి కూచుని సుష్టుగా భోం చేస్తాడు. ఆనందమూర్తి భోజనానికి వచ్చాడంటే ఆ వేళ ఆ ఇంట్లో ఇద్దరో, ముగ్గురో పస్తులుండాల్సిందే.

ఆనందమూర్తి చేసే ఈరకమైన పనులు క్రమంగా అందరికీ అయిష్టంగా తయారయ్యాయి. నాలాగా అతని భోజన ప్రియత్వాన్ని మెచ్చుకోగల రసికులు కరువైపోయారు. ఆనందమూర్తి అతి చిన్న ఉద్యోగి. అతనికి డబ్బు లేదు. అతనిలో అందం లేదు. ఆకర్షణ లేదు. కనీసం కాస్సేపు సరదాగా కబుర్లు చెప్పే శక్తయినా లేదు. అతనితో ఎవరికీ ఎలాంటి అవసరమూ లేదు. అంచేత అతనికి అడిగినప్పుడల్లా తిండి తినిపించడం అనవసరమని అందరూ అనుకున్నారు. తిండి తినే అన్ని సమయాల్లోనూ అతన్ని తప్పించుకోవటం ప్రారంభించారు. కొందరు మొండిగా నీకు పెట్టం, పొమ్మని మొహాన్నే అనెయ్యటం అలవాటు చేసుకున్నారు.

ఆనందమూర్తి కిలాంటి అన్యాయం జరగటం నాకు చాలా బాధ కలిగించింది. నేనూ భోజనప్రియుణ్నే అయినా, అచ్చ తెనుగులో చెప్పాలంటే తిండిపోతునే అయినా, నా తిండి నేనే తిన్నాను గాని, పెట్టగలిగినప్పుడల్లా అందరికీ నేనే పెట్టాను గాని, ఎన్నడూ ఎవర్నీ నేను యాచించలేదు. అందుచేత నేనంటే అందరికీ గౌరవం వుంది. ఉద్యోగరీత్యా నా హోదాని బట్టి నాకు కొంత పలుకుబడి కూడా వుంది. మా ఆఫీసులో వున్న ఒకే ఒక లేడీ టైపిస్ట్ ఆఫీసు మొత్తం మీద ఇద్దరే ఇద్దరికి నమస్కారం చేస్తుంది. ఆ ఇద్దరిలో నేనొకణ్ణి. ఇది నా

పలుకుబడికి నికార్సయిన నిదర్శనం.

ఇది నా పలుకుబడి గురించిన కథ కాదు. నా భోజన ప్రియత్వం గురించిన కథ కూడా కాదు. ఆనందమూర్తి భోజన ప్రియత్వం గురించిన కథ. ఆ సంగతే చెప్తున్నాను.

నా గౌరవాన్నీ పలుకుబడినీ వినియోగించి, ఆనందమూర్తి అంటే అందరికీ వున్న ంయిష్టతని తొలగించాలని చాలా ప్రయత్నించాను. ఆనందమూర్తిలో వున్న భోజనశక్తిలో వున్న గొప్పతనాన్ని వివరిస్తూ ఉపన్యాసాలిచ్చాను. చిన్న సైజులో ఒక తిండి పోటీ ఏర్పాటు చేసి, అందులో అవలీలగా నెగ్గిన ఆనందమూర్తికి, అందరి సమక్షంలోనూ, 'భోజనరాజు' అనే బిరుదు ఇచ్చి సత్కరించాను. అయినా ఏమీ లాభం లేకపోయింది. ఎవరూ ఆనందమూర్తిని ఆదరించలేదు.

అది సహించలేక, నేనే వీలయినప్పుడల్లా ఆనందమూర్తికి ఇంటా బయటా కూడా అన్నిరకాల తిళ్ళూ అతను తిన్నంత పెట్టించి అతనితో పాటు నేనూ ఆనందించడం అలవాటు చేసుకున్నాను. తరచుగా మా ఇంటి కొచ్చి తనివితీరా తిని వెళ్లడం ఆనందమూర్తికి అలవాటై పోయింది.

"ఇవ్వాళ రాత్రికి మీ ఇంటికి భోజనానికి వస్తున్నాను గురూగారూ' అని ఆ వేళ సాయంత్రం ఆనందమూర్తే స్వయంగా చెప్పాడు. సరే, రమ్మన్నాను.

ఆవేళ అదృష్టవశాత్తూ మా ఆవిడకి నా మీద గల ప్రేమ మరీ ఎక్కువ కాకుండానూ, మరీ తక్కువ కాకుండానూ నార్మల్ లెవల్‌లో వుంది. అందుకని వంట అద్భుతంగా చేసింది. ఒకటికి పది వంటకాలు చేసింది.

ఆనందమూర్తితో సమానంగా తినాలన్నది నా జీవితాశయం. అతనితో కలిసి తిన్నప్పుడల్లా అందుకోసం ప్రయత్నిస్తూనే వుంటాను. ఓడిపోతూనే వుంటాను. ఆవేళ ఏమైనా సరే ఆనందమూర్తిని ఓడించాలనే పట్టుదలతో అతని కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను.

కాని ఆ రాత్రి ఎంతసేపటికీ ఆనందమూర్తి రాలేదు. ఎనిమిదింటికొస్తానన్న వాడు తొమ్మిదైనా, పదైనా, పదకొండైనా కూడా రాలేదు. పిల్చుకొద్దామంటే అతని ఇల్లు నాకు తెలీదు. అతను నన్నెప్పుడూ భోజనానికి పిలవలేదు. వాళ్ల ఇంటికి ఎప్పుడూ తీసుకెళ్ళలేదు. చేసిన వంటకాలన్నీ చల్లారిపోయాయి. నా ఉత్సాహమంతా చప్పగా చల్లారిపోయింది. ఆ రాత్రి ఆనందమూర్తి అసలు రానే లేదు.

* * *

మర్నాడు ఆఫీసులో ఆనందమూర్తిని పట్టుకుని, అలా చేసినందుకూ నాకంత ఆశాభంగం కలిగించినందుకూ బాగా దులిపేశాను. అతనేమీ మాట్లాడలేదు. ఎందుకు రాలేదంటే ఏమీ

సమాధానం చెప్పలేదు.

ఆవేళ సాయంత్రం ఆఫీసు నుంచి బయటికొచ్చాక ఆనందమూర్తిని మళ్ళీ పట్టుకున్నాను. అలవాటుగా మేం వెళ్ళే హోటల్ కెళ్ళి కూర్చున్నాం. హోటల్లో కొచ్చినా కూడా ఆనందమూర్తికి చురుకు పుట్టలేదు. అలాగే దిగులుగా, నీరసంగా ఏడుపు మొహంతో కూర్చున్నాడు. టిఫిన్ వద్దన్నాడు. తనే అడిగి తినేవాడు, నేను బలవంతం చేసినా వద్దన్నాడు. నాకు మతి పోయింది. కాఫీ మటుకు తాగాడు. సిగరెట్టిచ్చి, మళ్ళీ అడిగాను. కిందటి రాత్రి భోజనానికి ఎందుకు రాలేదని.

ఆనందమూర్తి మళ్ళీ కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. నేను తరచి తరచి అడగ్గా అప్పుడు చెప్పాడు. ఆ చెప్పిన వాడు నాకు తెలిసిన ఆనందమూర్తి కాడు. ఆ చెప్పిన మాటలు నాకు తెలిసినవి కావు.

అసలవి మాటలు కాదు. విచారానికీ విషాదానికీ బరువుంటే, ఆ బరువు కోటి టన్నులుంటే, దానికింద అణిగిపోయిన ఆనందమూర్తి ఆక్రందనలవి. ఆ మాటలు మళ్ళీ నేను అతను చెప్పినట్టుగా చెప్పలేను. వాటి సారాంశం మటుకు చెపుతాను.

ఆనందమూర్తి ఆ రాత్రి మా ఇంటికి భోజనానికి బయల్దేరుతుంటే - అతని అయిదుగురు పిల్లల్లో ఆఖరి వాడొచ్చి "నాన్నా ! అన్నానికి నన్నెప్పుడూ తీసుకెళ్ళవే, నేనూ వస్తా" అన్నాడు. ఆ మాటకి ఆనందమూర్తి గుండె గుఢ్ఢు చితికినట్టు చితికిపోయింది. అతని ఇంట్లో నెలకి కనీసం వారం రోజులు పస్తులుంటారు. అతని సంపాదన అతనికీ అతని భార్యకీ, అయిదుగురు పిల్లలకీ. పెళ్ళీడొచ్చిన ఇద్దరు చెల్లెళ్ళకీ, ముసలి తల్లికీ చాలదు. పస్తులున్న నాడల్లా ఆనందమూర్తి తన తిండికి దేశమ్మీద పడతాడు. అతను అంతగా తినటం భోజనప్రియత్వం వల్ల కాదు - అవసరమైతే మర్నాటికి పస్తు వుండడానికి. ఇన్నాళ్ళూ ఇంట్లో అందరి సంగతీ బలవంతాన మరిచిపోయి తన పొట్ట తను నింపుకున్నాడు. కొడుకు అడిగిన మాట అతని కళ్ళు తెరిపించింది. "పెట్టగలిగితే అందరికీ పెడతాను. లేకపోతే అందరితో పాటు నేనూ పస్తులుంటాను" అన్నాడు ఆఖరి మాటగా ఆనందమూర్తి .

నేనిప్పటిదాకా మీతో చిన్న అబద్ధమాడాను. ఇది నా కథ కాదు. నాలా కడుపు నిండా తినేవాళ్ళ కథ కాదు. సగం కడుపు ఖాళీగా, సగం సగం బ్రతికే వాళ్ళ కథ. ●

*(యువ : దీపావళి ప్రత్యేక సంచిక - 1975)*